
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం, 12, జూలై, 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల) : సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 26.604 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయంలో 90.565 మీటర్ల నీటిమట్టం నమోదైంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.60,730
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,454
3 శాతం జీఎస్టీతో..	రూ.5,618
సవర (8 గ్రా)	రూ.44,944

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.5 /28.2

మంగళవారం గాలిలో తేమ 65 శాతం ఉంది. బుధవారం వాతావరణం చల్లగా ఉంటుంది. జిల్లాలో చిరుజల్లులు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

మాతాశిశు సంరక్షణపై కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట): జిల్లాలో మాతా శిశు సంరక్షణ సేవలు పటిష్టంగా అమలు చేయాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తమ చాంబర్‌లో కలెక్టర్.. వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమావేశమై జిల్లాలో మాతాశిశు సంరక్షణ సేవలపై సమీక్షించారు. మాతా శిశు సంరక్షణ సేవలు కచ్చితంగా అమలు జరిగేలా క్షేత్రస్థాయిలో వైద్యాధికారుల పనితీరును తరుచూ సమీక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీసీహెచ్ఎస్ డాక్టర్ రమేష్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

2.49 లక్షల మందికి సర్టిఫికెట్ల అందజేత



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి

నెల్లూరు(పొగతోట): జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 345 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాలు పూర్తి చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి అన్నారు. మంగళవారం డీఆర్‌డీఏ కార్యాలయంలో ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో పీడీ మాట్లాడారు. ఈ నెల 1 నుంచి 8వ తేది వరకు నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం 2,78,011 దరఖాస్తులు వచ్చాయన్నారు. 2,49,858 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లు అందజేశామన్నారు. 1861 దరఖాస్తులను రిజక్ట్ చేశామన్నారు. 26,291 మందికి త్వరలో సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు.

మూడు టిప్పర్ల సీజ్



మైనింగ్ అధికారులు సీజ్ చేసిన టిప్పర్

పొదలకూరు: సైదాపురం మండలం నుంచి పొదలకూరు మీదుగా కంకర, తెల్లరాయి తరలిస్తున్న మూడు టిప్పర్లను మైనింగ్ అధికారులు మంగళవారం పొదలకూరుకు సమీపంలో సీజ్ చేశారు. మైనింగ్ ఏడీ శ్రీనివాసులు తన సిబ్బందితో దాడులు నిర్వహించి అక్రమంగా రాయి తరలిస్తున్న టిప్పర్లను అదుపులోకి తీసుకున్నారు. రికార్డులను పరిశీలించి జరిమానా విధించినట్టు ఏడీ పేర్కొన్నారు.

కర్నూలుకు ఏసీ బస్సు సౌకర్యం

నెల్లూరు సిటీ: ఏపీఎస్‌ఆర్‌టీసీ నెల్లూరు నుంచి కర్నూలుకు తొలిసారి ఏసీ బస్సు సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చిందని నెల్లూరు-2 డిపో మేనేజర్ శివకేశవ్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఇంద్రా ఏసీ సర్వీస్ 9వ తేదీ నుంచి అందుబాటులో ఉందని తెలిపారు. నెల్లూరు నుంచి రాత్రి 10.15 గంటలకు కర్నూలుకు బయలుదేరుతుందని, అలాగే మరుసటిరోజు కర్నూలు నుంచి నెల్లూరుకు రాత్రి 10 గంటలకు బయలుదేరుతుందని తెలిపారు. నెల్లూరు నుంచి కర్నూలుకు చార్జీ రూ.800 ఉందని, అయితే ప్రయాణికులకు 10 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపారు.

టమాటాల కోసం బారులు



టమాటాల కోసం బారులు తీరిన మహిళలు

నెల్లూరు (వీఆర్సీసెంటర్): బహిరంగ మార్కెట్‌లో టమాటా ధర రూ.100 నుంచి రూ.150 వరకు పలుకుతుండడంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు రైతుబజార్ల వద్ద మంగళవారం టమాటా విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసింది. నగరంలోని నవాబుపేట, ఫత్తేఖాన్‌పేట రైతుబజార్లలో కిలో టమాటా రూ.50 వంతున ఒక్కొక్కరికి రెండు కేజీల టమోటాలను ఆధార్ కార్డు ఆధారంగా విక్రయించారు. దీంతో నవాబుపేట రైతుబజార్‌లో మహిళలు పెద్ద సంఖ్యలో క్యూలైన్లలో నిలబడి సబ్సిడీతో అందచేసిన టమాటాలను కొనుగోలు చేశారు.

గ్రావెల్ మాఫియా పాపం సోమిరెడ్డిదే!

గత టీడీపీ ప్రభుత్వంలో గొలగమూడిలోని చాకలి చెరువులో అక్రమ తవ్వకాలతో ఏర్పడ్డ భారీ గుంతలు



రాష్ట్ర ప్రభుత్వంపై టీడీపీ నేతలు ఓవైపు అసత్య ప్రచారం చేస్తుంటే.. మరోవైపు 'ఈనాడు' తప్పుడు కథనాలు ప్రచురిస్తూ విషం చిమ్ముతోంది. సర్వేపల్లి నియోజకవర్గంలో గ్రావెల్ తవ్వకాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే కారణమని టీడీపీ నేత సోమిరెడ్డి ఆరోపించగా.. రోడ్ల అభివృద్ధిపై 'ఈనాడు' తప్పుడు కథనం ప్రచురించింది. వాస్తవాలను పరిశీలిస్తే గత టీడీపీ ప్రభుత్వంలో సోమిరెడ్డే గ్రావెల్ మాఫియాను ప్రోత్సహించారని వెల్లడైంది. అలాగే గ్రామీణ రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకున్నా 'ఈనాడు' తప్పుడు కథనం ప్రచురించిందని స్పష్టమైంది.

గత టీడీపీ ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా గ్రావెల్ అక్రమ తవ్వకాలు

- ఫలితంగా ప్రతి గ్రామంలో భారీ గుంతలు
- ఆ గుంతల్లో పడి ఎవరైనా చనిపోతే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నిందలు

వెంకటాచలం: గత టీడీపీ ప్రభుత్వంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అండతో వెంకటాచలం మండలంలో గ్రావెల్ మాఫియా విచ్చలవిడిగా చెలరేగిపోయింది. గ్రామాల్లో గ్రావెల్ అక్రమ తవ్వకాలతో భారీ గుంతలు ఏర్పడ్డాయి. టీడీపీ నాయకులు తవ్విన గ్రావెల్ గుంతలు వేసవిలో చిన్నారులను బలి తీసుకుంటున్నాయి. తాను చేసిన పాపాలను సోమిరెడ్డి ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై వేసేందుకు చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టడంతో ప్రజల ముందు నవ్వులపాలయ్యాడు. ఇలాంటి ఘటన తాజాగా వెంకటాచలం మండలంలోని గొలగమూడి గ్రామంలో వెలుగుచూసింది.

అడ్డూఅదుపూ లేకుండా..

గత ప్రభుత్వంలో వెంకటాచలం మండలంలోని సర్వేపల్లి రిజర్వాయర్, కనుపూరు చెరువులతోపాటు గ్రామాల్లోని అన్ని చెరువుల్లోనూ ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టారు. దీనిపై అప్పట్లో రైతులు, గ్రామస్తులు పలు దఫాలు ఆందోళనలు చేసినా సోమిరెడ్డి అండతో గ్రావెల్ అక్రమ రవాణా అడ్డూఅదుపూ లేకుండా నిర్విరామంగా సాగింది. వర్షాకాలంలో చెరువుల్లో నిండుగా నీరు చేరడంతో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను సైతం వదలకుండా అక్రమంగా గ్రావెల్ తవ్వి కోట్లాది రూపాయలు సొమ్ము చేసుకున్నారు. టీడీపీ నాయకుల ధనదాహం కారణంగా గ్రామానికి అనుకుని ఉన్న చెరువులు, ప్రభుత్వ, ప్రైవేట్ భూముల్లో భారీగా గుంతలు ఏర్పడ్డాయి. కొన్ని గ్రామాల్లో 10 నుంచి 20 అడుగుల లోతుకు పైగా టీడీపీ నాయకులు తవ్విన గ్రావెల్ గుంతలు సాక్ష్యాలుగా కనిపిస్తున్నాయి.

సోమిరెడ్డి ధనదాహానికి విద్యార్థుల బలి

2014 ఎన్నికల్లో ఓటమిపాలైన సోమిరెడ్డి దొడ్డిదారిన మంత్రి పదవి దక్కించుకుని అవినీతి, అక్రమ సంపాదనపై దృష్టి సారించారు. అందులో భాగంగానే వెంకటాచలం మండలంలో సర్వేపల్లి రిజర్వాయర్, కసుమూరు, ఈదగాలి, తిక్కవరప్పాడు, కంటేపల్లి, కనుపూరు రిజర్వాయర్, సర్వేపల్లి గ్రామాల నుంచి రేయింబవళ్లు అక్రమంగా గ్రావెల్ తరలించి కోట్లాది రూపాయలు దోచుకున్నారు. సోమిరెడ్డి తవ్వించిన భారీ గ్రావెల్ గుంతలు గత నెలలో అనికేపల్లిలో ఒక విద్యార్థిని, మూడు రోజుల క్రితం గొలగమూడిలో మరొక విద్యార్థిని బలి తీసుకున్నాయి. అనికేపల్లి గ్రామానికి చెందిన 5వ తరగతి విద్యార్థి తురకా వెంకయ్య తోటి విద్యార్థులతో కలిసి గ్రామానికి అనుకుని ఉన్న సర్వేపల్లి రిజర్వాయర్ వద్దకు ఈతకు వెళ్లి గ్రావెల్ గుంతలో పడి మృతిచెందాడు. ఇది సోమిరెడ్డి హయాంలో తవ్విన గ్రావెల్ గుంతే. కానీ ఈ మరకను సోమిరెడ్డి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై నెట్టే కుట్ర చేసి విఫలమయ్యాడు. గొలగమూడిలో టీడీపీ నాయకులు చాకలి చెరువులో తవ్విన గ్రావెల్ గుంతలో పడి మూడు రోజుల క్రితం 2వ తరగతి విద్యార్థి హిమాయితుల్లా మృతిచెందడంతో తన పాపాలు ఎక్కడ బయటపడతాయోననే భయంతో ఆ గ్రామానికి వెళ్లి వైఎస్సార్‌సీపీ నాయకులు తవ్విన గోతులని చెప్పే ప్రయత్నం చేశాడు. కానీ ఆ సమయంలో అక్కడే ఉన్న టీడీపీ నాయకులు కొందరు అవి ఇప్పుడు తవ్విన గుంతలు కాదని, 2016–17లో తవ్విన గుంతలని చెప్పడంతో అందరి ముందు నవ్వులపాలయ్యాడు. ఒకే పంచాయతీలోని అనికేపల్లి, గొలగమూడి గ్రామాల్లో సోమిరెడ్డి ధనదాహానికి ఇద్దరు చిన్నారులు బలయ్యారని గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ హయాంలోనే అక్రమ తవ్వకాలు



గత టీడీపీ ప్రభుత్వంలో గొలగమూడి గ్రామంలో ఇష్టారాజ్యంగా గ్రావెల్ తవ్వకాలు చేపట్టారు. సోమిరెడ్డి అండతో నాగులవరం, గొలగమూడి గ్రామాల చుట్టూ గ్రావెల్ అక్రమంగా తరలించడంతో ఎక్కడ చూసినా భారీ గుంతలు ఏర్పడ్డాయి. సోమిరెడ్డి హయాంలో తవ్విన చాకలి చెరువు గుంతలో పడి హిమాయితుల్లా మృతిచెందితే దానిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అంటగట్టే ప్రయత్నం చేయడం సరికాదు.

– అన్నపరెడ్డి శీనయ్య, గొలగమూడి

సోమిరెడ్డే కారణం



గొలగమూడి, అనికేపల్లి గ్రామాల్లో ఇద్దరు చిన్నారులు గ్రావెల్ గుంతల్లో పడి చనిపోవడానికి సోమిరెడ్డే కారణం. టీడీపీ ప్రభుత్వంలో సోమిరెడ్డి అండతో గ్రావెల్ తవ్వకాలు అడ్డూఅదుపూ లేకుండా సాగాయి. అప్పట్లో తవ్విన గ్రావెల్ గుంతల్లో పడి ఇద్దరు విద్యార్థులు మృతిచెందిన విషయం వాస్తవం. కానీ సోమిరెడ్డి దిగజారి ఆ పాపాన్ని వైఎస్సార్‌సీపీపై వేసే ప్రయత్నం చేయడం సిగ్గుచేటు.

– ఉడతా శ్రీనివాసులు, గొలగమూడి

'ఈనాడు' తప్పుడు రాతలు
కొత్త రోడ్లే అభివృద్ధికి సాక్ష్యం



రూ.కోటి నిధులతో నిర్మించిన కంచరపాళెం-రామతీర్థం ఆర్‌అండ్‌బీ రోడ్డు

- నిజాన్ని దాచి అబద్ధాలు ప్రచారం
- గ్రామాల్లో రోడ్లు వేయలేదంటూ కథనాలు

బుచ్చిరెడ్డిపాళెం: విడవలూరు మండలం వావిళ్ల గ్రామంలో ఉన్న పంచాయతీరాజ్ రోడ్డు గుంతలమయంగా ఉందని, దీని వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని 'ఈనాడు' ప్రచురించిన కథనంలో వాస్తవం ఏంటో పరిశీలిస్తే ఈ రోడ్డును 2005లో నిర్మించారు. కాలక్రమంలో ఈ రోడ్డుకిరువైపులా ఇళ్ల నిర్మించుకోవడంతో రోడ్డు మార్జిన్‌లో మట్టి ఎత్తుగా ఏర్పడింది. దీంతో రోడ్డుపై వర్షపు నీరు నిలిచి పూర్తిగా దెబ్బతింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డును బాగుచేయాలని ప్రజలు కోరినా నేతలు పట్టించుకోలేదు. అయితే ఇటీవల కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించినప్పుడు వావిళ్ల గ్రామస్తులు ఈ రోడ్డును అభివృద్ధి చేయాలని కోరగా.. వెంటనే కోవూరు మార్కెటింగ్ కమిటీకి రూ.కోటితో ప్రతిపాదనలు పంపారు. నిధులు కూడా మంజూరయ్యాయి. ఈ నిధులతో దాదాపు 700 మీటర్ల మేర సిమెంట్ రోడ్డుతోపాటు ఒక వైపు సైడ్ కాలువను నిర్మించనున్నారు. ఈ పనులకు సంబంధించి త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభించేందుకు పంచాయతీరాజ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అయితే బిల్లులు రావడం లేదనే కారణాన్ని బూచిగా చూపుతూ టెండర్లకు ఎవరూ ముందుకురావడం లేదంటూ 'ఈనాడు' అసత్య కథనాన్ని ప్రచురించింది.

రూ.3.40 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్ల అభివృద్ధి

గత నాలుగు నెలల వ్యవధిలోనే విడవలూరు మండలంలో దాదాపు రూ.3.40 కోట్ల ఆర్‌అండ్‌బీ నిధులతో మూడు రోడ్లను నిర్మించారు. విడవలూరు నుంచి జాన్‌పేట మీదుగా ముదివర్తి వరకు దాదాపు రూ.1.20 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్డును నిర్మించారు. అలాగే పార్లపల్లి నుంచి మోడేగుంట మీదుగా కోవూరు మండలం వేగూరు వరకు దాదాపు రూ.1.20 కోట్లతో ఆర్‌అండ్‌బీ రోడ్డును నిర్మించారు. దీంతోపాటు విడవలూరు మండలంలోని కంచరపాళెం నుంచి రామతీర్థం మీదుగా వెంకటనారాయణపురం వరకు సుమారు రూ.కోటితో ఆర్‌అండ్‌బీ రోడ్డును నిర్మించారు. గ్రామీణ ప్రాంతాల రహదారులను కోట్లాది రూపాయలు వెచ్చించి ఈ స్థాయిలో అభివృద్ధి చేస్తున్నా ప్రజలను మభ్యపెట్టేలా 'ఈనాడు' అసత్య కథనాలను ప్రచురించడంపై ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారు.



వావిళ్ల వద్ద రూ.కోటి నిధులతో సిమెంట్ రోడ్డు వేయనున్న మార్గం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వేసిన పాతదేవరాయపల్లి - ఆమని చిరువెళ్ల రోడ్డు



బొమ్మవరంలో ఇటీవల వేసిన సీసీ రోడ్డు

చేజర్ల(సోమశిల): వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. పేద ప్రజల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడంతోపాటు అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడుతున్నారు. ఇందుకు అనంతసాగరం మండలంలోని పలు గ్రామాల్లో వేసిన కొత్త రోడ్లే నిదర్శనం. గ్రామీణ ప్రాంతాల్లో తారురోడ్లు వేసి రహదారులను అభివృద్ధి చేయడం ద్వారా ప్రజలకు రాకపోకలు సులభతరమయ్యాయి. అంతేకాక గ్రామీణ ప్రాంతాల్లో కొత్త రోడ్లు వేస్తుండడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పాతదేవరాయపల్లి నుంచి ఆమని చిరువెళ్ల, వెంగంపల్లి వరకు 7 కిలోమీటర్ల రోడ్డు రూ.1.80 కోట్లతో నిర్మించారు. దీంతో ఆ మార్గంలో ప్రయాణం సౌకర్యవంతమైంది. అలాగే పలు గ్రామాల్లో సీసీ రోడ్లు వేశారు. బొమ్మవరంలో రూ.18 లక్షలతో సీసీ రోడ్డు నిర్మించారు. బొమ్మవరం వడ్డిపాళెం, బొమ్మవరం అగ్రహారం, కాలనీల్లో రూ.23 లక్షలతో సిమెంట్ రోడ్లు నిర్మించారు. మంచాలపల్లిలో రూ.15 లక్షలతో, మినగల్లులో రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించారు. అనంతసాగరం – ఆత్మకూరు మార్గంలో కామిరెడ్డిపాడు, సంజీవనగర్ వద్ద రోడ్లు బాగుండడంతో వాహనదారులు సౌకర్యవంతంగా ప్రయాణిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గ్రామీణ ప్రాంతాల్లో రహదారులను అభివృద్ధి చేయడంతోపాటు అంతర్గత రోడ్లు వేసి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంది. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత నాలుగేళ్లగా రోడ్లను అభివృద్ధి చేయడం లేదని, రహదారులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని 'ఈనాడు' తప్పుడు కథనం ప్రచురించడంపై ప్రజలు ఏవగించుకుంటున్నారు. వాస్తవాలను పరిశీలిస్తే రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తోందని స్పష్టమైంది..



మాట్లాడుతున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, పక్కన కలెక్టర్ హరినారాయణన్ తదితరులు

అంకితభావంతో వైద్యసేవలందించాలి

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): వైద్యులు, వైద్యసిబ్బంది రోగులకు అంకితభావంతో వైద్యసేవలందించి ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి మంచిపేరు తీసుకురావాలని నెల్లూరు ఎంపీ, నెల్లూరురూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచించారు. నగరంలోని జిల్లా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి(జీజీహెచ్) అభివృద్ధి సొసైటీ కమిటీ సమావేశం మంగళవారం ఆ ఆస్పత్రిలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంపై ప్రత్యేక దృష్టి సారించి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. మెడికల్ కళాశాలలో పీజీ సీట్ల కోసం కృషి చేస్తున్నట్లు తెలిపారు. గత మూడు నెలలుగా తమ దృష్టికి, కలెక్టర్ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించామని, రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి కూడా జిల్లా ప్రధాన వైద్యశాలను సందర్శించి, ఆస్పత్రి అభివృద్ధికి నిధులు మంజూరు చేసేలా కృషి చేస్తామని తెలిపారు.

జీజీహెచ్ అభివృద్ధికి చర్యలు

కలెక్టర్ హరినారాయణన్ మాట్లాడుతూ రోగులకు అన్ని మౌలిక సదుపాయాలు, చికిత్సలు అందుబాటులో ఉండేలా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని వైద్యకళాశాల ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రధానంగా రోగులు ప్రైవేట్ వైద్యశాలలపై ఆధారపడకుండా, ఎలాంటి ఖర్చు లేకుండా ప్రభుత్వ వైద్యశాలలోనే మెరుగైన వైద్యసేవలు అందించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. క్యాజువాలిటీ బలోపేతంపై ప్రత్యేక దృష్టి సారించామని, ట్రామా, ఎమర్జెన్సీ కేర్ విభాగాల పనితీరు మెరుగుపడేలా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. పూర్తిస్థాయిలో స్పెషలిస్ట్ వైద్యులు, నర్సులను, సిబ్బందిని నియమించేలా ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారన్నారు. అంతకుముందు వైద్యశాలలో చేపట్టిన, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సిద్దినాయక్ వివరించారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి మంజూరు చేసిన రూ.95 లక్షల నిధులను ఆస్పత్రిలో లిఫ్టులు, ఏసీలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు వినియోగించినట్లు తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్, ఏసీఎస్సార్ ప్రభుత్వ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జమున, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ కోఆర్డినేటర్ లక్ష్మీసునంద, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ ఉమాశంకర్, ఆస్పత్రిలోని వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, వైద్యాధికారులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ట్రస్ట్‌లతో టీడీపీ రాజకీయం

- ఉదయగిరిలో ఎన్నికల వేళ పుట్టుకొస్తున్న ట్రస్ట్‌లు
- అనంతరం మాయమవుతున్న వైనం

టీడీపీ నేతలకు ఎన్నికల వేళ పేద ప్రజలపై అమాంతం ప్రేమ పుట్టుకొస్తోంది. అధికారంలో ఉన్నప్పుడు బుక్కెడు బువ్వ పెట్టని ఆ పార్టీ నేతలు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ట్రస్ట్‌లతో రాజకీయ జిమ్మిక్కులు ప్రదర్శిస్తున్నారు. అధికారానికి దూరమయ్యాక అడ్రస్ లేకుండా పోయే ఈ నేతలు ఆర్థికసాయాల పేరుతో వ్యక్తిగత ప్రచారాన్ని పొందుతున్నారు. ఉదయగిరి నియోజకవర్గంలో ఎన్నికల స్టంట్ ట్రస్ట్‌లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చి ఆ తర్వాత కనుమరుగవుతున్నాయి.

సాక్షి ప్రతినిధి నెల్లూరు: ఉదయగిరి నియోజకవర్గంలో పలువురు నేతలు ట్రస్ట్‌ల పేరుతో రాజకీయ లబ్ధికి తెరతీస్తున్నారు. సేవా కార్యక్రమాలు, ఆర్థిక సహాయాలు, అన్నదాన కార్యక్రమాలు, అవసరార్థులకు పరికరాల పంపిణీ అంటూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారు. జిల్లాలో ఏ నియోజకవర్గంలో లేనివిధంగా ఉదయగిరిలో కేవలం ఎన్నికల ఏడాదిలోనే ఈ సేవా సంస్థలు పుట్టుకొస్తున్నాయి. ఈ ధోరణి గడిచిన రెండు సార్వత్రిక ఎన్నికల నుంచి కొనసాగుతోంది.

టీడీపీ టికెట్ వస్తుందని..

2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు జలదంకి మండలానికి చెందిన మైనింగ్ వ్యాపారి దగుమాటి వెంకటకృష్ణారెడ్డి(కావ్య కృష్ణారెడ్డి) ఓ ట్రస్ట్ ఏర్పాటు చేసి పలు కార్యక్రమాలు చేపట్టారు. ఆయన టీడీపీ తరపున ఉదయగిరి నుంచి పోటీలో నిలిచేందుకు ఎన్నికలకు ఏడాది ముందు ట్రస్ట్ పేరుతో రాజకీయం చేశారు. నియోజకవర్గంలోని విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, కొంతమందికి మంచాలు పంపిణీ చేశారు. ఆలయాలకు విరాళాలు అందజేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టీడీపీ నుంచి తనకు టికెట్ రాదని తెలిసి ఆ కార్యక్రమాలకు స్వస్తి పలికారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని పసిగట్టి తర్వాత సేవా కార్యక్రమాలు పూర్తిగా నిలిపివేశారు. నిజంగా ప్రజలపై ప్రేమ, సేవా దృక్పథం ఉంటే ట్రస్ట్ సేవలను కొనసాగించేవారు కదా అని ప్రజలు ఏవగించుకుంటున్నారు.

ప్రజల్లో గుర్తింపు కోసం పాకులాట

ఉదయగిరి మండలానికి చెందిన స్థానిక నాయకుడు మన్నేటి వెంకటరెడ్డి 'మన' ఫౌండేషన్ పేరుతో ట్రస్ట్‌ను ప్రారంభించారు. టీడీపీ తరఫున ఉదయగిరి నుంచి పోటీ చేయాలని కొంతకాలం క్రితం లోకేశ్‌ను కలిసి సేవా కార్యక్రమాల పేరుతో రాజకీయంగా ఎదగాలని చూస్తున్నారు. రాజకీయంగా పలుకుబడి లేకపోయినా ట్రస్ట్ పేరుతో ప్రజల్లో గుర్తింపు తెచ్చుకునేందుకు ఆయన కూడా పలువురికి ఆర్థికసాయం చేస్తూ ఆలయాలకు చందాలిస్తున్నారు. ఇటీవల వింజమూరులో అన్న క్యాంటీన్ ప్రారంభించి కొన్ని రోజులకే ఎత్తేశారు. తాజాగా ఉదయగిరిలో ప్రారంభించారు.

ఎన్నికల తర్వాత పత్తా లేని ట్రస్ట్‌లు

గతంలో కూడా ఎన్నికల సమయంలో పలువురు ట్రస్ట్‌ల ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించి ఎన్నికలు పూర్తయ్యాక పత్తా లేకుండాపోయారు. 2024 ఎన్నికలు పూర్తయ్యాక వాటి తరహాలోనే 'మన ఫౌండేషన్', కాకర్ల ట్రస్ట్ ఉంటాయని పలువురు చర్చించుకుంటున్నారు. ఉదయగిరి అసెంబ్లీ స్థానం నుంచి టీడీపీ బరిలో నిలవాలనే ఆలోచనలతోనే ట్రస్ట్‌ల పేరుతో జిమ్మిక్కులు చేస్తూ ప్రజల సానుభూతి పొందాలని ప్రయత్నిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే గతంలో ఇలాంటి ప్రయత్నాలు చేసిన వారు ఎన్నికల్లో ఆశించిన ఫలితాలు పొందిన దాఖలాలు లేవు.

టికెట్ కోసం జిమ్మిక్కులు

ఉదయగిరికి ప్రాంతానికి చెందిన ఎన్ఆర్ఐ కాకర్ల సురేష్ నియోజకవర్గంలో కాకర్ల ట్రస్ట్ పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రచారానికి ప్రాధాన్యం ఇస్తున్నారు. రాజకీయంగా ఎలాంటి పలుకుబడి లేకపోయినా ధనబలంతో ప్రజల్లో తనదైన ముద్ర వేసుకోవాలని ప్రయత్నిస్తున్నారు. 2024లో ఉదయగిరిలో టీడీపీ టికెట్ కోసం జిమ్మిక్కులు ప్రదర్శిస్తున్నారు. వాస్తవంగా ఆయన పుట్టి పెరిగింది ఉదయగిరి ప్రాంతం కాదు. ఎప్పుడో ఆయన ముత్తాతలు వరికుంటపాడు మండలానికి చెందిన వారు కాగా ఎన్ఆర్ఐ పేరుతో హడావుడి చేస్తున్నారు. మాజీ ఎమ్మెల్యే బొల్లినేనికి వ్యతిరేకంగా వర్గ రాజకీయాలు చేస్తున్నారు.

హెచ్చరిక ప్రకటన

నా కక్షిదారుడైన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, కోటపల్లి గూడూరు మండలం, వరిగొండ గ్రామ కాపురస్తుడైన **చిల్లకూరు ప్రవీణ్ కుమార్ తండ్రి సుధాకర్ రెడ్డి** ఇచ్చిన సంతాయిషీ మేరకు యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా: -

ఈ దిగువ కనబరిచిన ఆస్తులను తన తండ్రి గారైన **చిల్లకూరు సుధాకర్ రెడ్డి** గారు **ఓరల్ అగ్రిమెంట్ ఆఫ్ సేల్** ద్వారా నా కక్షిదారునికి విక్రయించి స్వాధీనపరచియున్నారు. తదుపరి సదరు సుధాకర్ రెడ్డి గారికి కుమార్తె మరియు నా కక్షిదారునికి సోదరి అయిన **ముసునూరు పద్మజ భర్త సాయి కిషోర్ రెడ్డి,** ముసునూరువారిపాలెం గ్రామం, ముత్తుకూరు మండలం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అను ఆమె ప్రోద్బలము వలన సదరు **సుధాకర్ రెడ్డి** ఈ దిగువ కనబరిచిన ఆస్తులకు సంబంధించి నా కక్షిదారుడి పేరిట **రిజిష్టరు విక్రయ పత్రం** వ్రాయుటకు నిరాకరించినందున, నా కక్షిదారుడు సదరు **సుధాకర్ రెడ్డి** మరియు **పద్మజ** గార్లపై **శ్రీ గౌరవనీయ నెల్లూరు 6వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో O.S No. 53/2023** అను దావాను దాఖలు చేసియున్నారు. మరియు సదరు దావాలో దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తులను పై తెలిపిన ప్రతివాదులు ఇతరులకు పరాధీనములు చేయకుండా **ఇంజంక్షన్ పిటీషన్ I.A No. 254/2023**ను దాఖలు చేసియున్నారు. సదరు దావా మరియు **ఇంజంక్షన్ పిటీషన్** పెండింగ్‌లో వున్నవి. సదరు **సుధాకర్ రెడ్డి** పైతెలిపిన విషయములన్నియు కప్పిపుచ్చి దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తులను ఇతరులకు విక్రయించుటకు ప్రయత్నములు చేయుచున్నాడని నా కక్షిదారునికి దూఢిగా తెలిసినది. కనుక ఎవ్వరైనను సదరు ఆస్తులను కొనుగోలు చేసిన లేక ఆదుమానము వుంచుకొన్న మరియు ఏ విధమైన పరాధీనములు చేసిన యెడల సదరు అన్యాక్రాంతములు చెల్లనేరవు అని మరియు అవి నా కక్షిదారుడు పై గానీ మరియు ఈ దిగువ కనపరచిన ఆస్తులపై బద్ధగించవు అని తెలియజేయడమైనది. అట్లు చేసిన యెడల అట్టి వారిపై సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకొనబడునని హెచ్చరించడమైనది.

ఎ-షెడ్యూలు

అయిటం నెం. 1: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా – నెల్లూరు రి॥డి॥ యిలాకా ముత్తుకూరు స॥రి॥లో చేరిన వరిగొండ గ్రామంలోని సర్వే నెం. 549రులో యం 4-03 సెంట్లు భూమి. **అయిటం నెం. 2:** వరిగొండ గ్రామంలోని సర్వే నెం.536/2, 537, 542/2 మరియు 543/1 ల్లు లోని యం 2-61 సెంట్లు భూమి. **అయిటం నెం. 3:** వరిగొండ గ్రామంలోని సర్వే నెం. 536/2, 536/1 మరియు 542/1 ల్లులోని యం 1-87 సెంట్లు భూమి. **అయిటం నెం. 4:** వరిగొండ గ్రామంలోని 48 అంకణములు ఖాళీ స్థలము **అయిటం నెం. 5:** వరిగొండ గ్రామంలోని 72 అంకణములు ఖాళీ స్థలము

బి-షెడ్యూలు

అయిటం నెం.1: వరిగొండ గ్రామంలోని సర్వే నెం.549 రు లోని యం 1-07 సెంట్లు భూమిలో సమిష్టిన 1/3వ భాగం. **అయిటం నెం. 2:** వరిగొండ గ్రామంలోని సర్వే నెం. 557రులోని యం 0-70 సెంట్లు భూమిలో సమిష్టిన 1/3వ భాగం. **అయిటం నెం. 3:** వరిగొండ గ్రామంలోని 21 అంకణములు ఖాళీ స్థలములో సమిష్టిన 1/3వ భాగం.

N. శ్రీనివాసులు రెడ్డి, B.Sc.,B.L.,
అడ్వకేట్, రాంజీనగర్, నెల్లూరు, సెల్: 9885448010

కత్తితో బెదిరించి నగదు దోచిన హోంగార్డు

- అరెస్ట్ చేసిన చిన్నబజారు పోలీసులు

నెల్లూరు(క్రైమ్): ఓ హోంగార్డు దోపిడీ దొంగ అవతారమెత్తాడు. ఓ వ్యక్తిని చంపుతామని కత్తితో బెదిరించి నగదు దోచుకెళ్లాడు. పోలీసుల కథనం మేరకు.. రాపూరు మండలం గిలకపాడు గ్రామానికి చెందిన షేక్ రియాజ్ నెల్లూరు నగరంలోని పోలీసు గ్యాస్ గోదాములో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. వ్యసనాలకు బానిసైన అతను ఒంటరిగా వెళ్లేవారిని, జంటలను లక్ష్యంగా చేసుకుని పోలీసునంటూ బెదిరించి దోచుకోసాగాడు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జనవరిలో దంపతులను బెదిరించిన ఘటనలో నెల్లూరు చిన్నబజారు పోలీసులు అతడిని అరెస్ట్ చేసి జైలుకు పంపారు. తాజాగా మరో వ్యక్తిని కత్తితో బెదిరించి నగదు దోచుకున్నాడు. ఇరుగోళమ్మ సంఘానికి చెందిన ఖాదర్‌బాషా దంపతులు అరవింద నగర్‌లో ఇంటిని అద్దెకు తీసుకున్నారు. సోమవారం ఆ ఇంటిని శుభ్రం చేసుకున్నారు. మధ్యాహ్నం అవడంతో ఖాదర్‌బాషా తన భార్యకు టీ తీసుకొచ్చేందుకు వెళ్తుండగా రియాజ్ అతడిని అడ్డుకున్నాడు. ఎక్కడికి వెళ్తున్నావని అడిగి నగదు డిమాండ్ చేశారు. ఖాదర్‌బాషా డబ్బుల్లేవని చెప్పడంతో చంపుతానని కత్తితో బెదిరించాడు. బ్యాంక్ అకౌంట్‌లో ఉన్నాయని బాధితుడు చెప్పడంతో రియాజ్ అతడిని తన బైక్‌లో ఎక్కించుకుని కస్తూరిదేవి స్కూల్ సమీపంలోని పెట్రోల్ బంకు వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ ఫోన్‌పే ద్వారా పెట్రోల్‌బంకు అకౌంట్‌కు రూ.5 వేలు ట్రాన్స్‌ఫర్ చేయించాడు. ఆ డబ్బును పెట్రోల్ బంకు సిబ్బంది నుంచి రియాజ్ తీసుకున్నాడు. ఈ విషయం బయటకు చెబితే అంతు చూస్తానని బెదిరించాడు. బాధితుడు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి కోసం గాలించి మంగళవారం అరెస్ట్ చేసి దోపిడీ సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి : రూ.25
సన్నవి : రూ.12
పండ్లు : రూ.5

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 115
లేయర్ (లైవ్) : 92
బ్రాయిలర్ చికెన్ : 202
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 226
లేయర్ చికెన్ : 156

ట్రాక్టర్ కింద పడి మహిళ మృతి

వరికుంటపాడు: మండలంలోని తిమ్మారెడ్డిపల్లికి చెందిన షేక్ అబీబా (38) అనే మహిళ మంగళవారం ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కింద పడి మృతిచెందింది. పోలీసుల కథనం మేరకు.. అబీబా ఉపాధి పనులు ముగించుకుని ఇంటికి కాలినడకన బయలుదేరింది. ఎస్సీకాలనీ సమీపానికి వచ్చే సరికి గ్రామానికి చెందిన ట్రాక్టర్ తిమ్మారెడ్డిపల్లి వైపు వెళ్తుండడంతో అబీబా ఆపి వెనుక వైపు ఎక్కింది. కొంతదూరం రాగానే జారి ట్రాలీ కింద పడింది. ఆమె శరీరంపై ట్రాలీ టైరు ఎక్కడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో స్థానికులు ఆమెను వెంటనే పామూరులో ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్సై విజయ శ్రీనివాస్ కేసును దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయాలపై దాడులు

నెల్లూరు(క్రైమ్): గంజాయి విక్రయాలపై నెల్లూరు వేదాయపాలెం పోలీసులు దాడులు చేసి ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. శ్రామికనగర్ రవిచంద్ర గిరిజన కాలనీ సమీపంలోని ఖాళీ స్థలాల్లో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయని వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ పీవీ నారాయణకు సమాచారం అందింది. ఆయన తన సిబ్బందితో కలిసి మంగళవారం నిఘా ఉంచారు. వైఎస్సార్ నగర్‌కు చెందిన ఎస్.హేమంత్, శ్రామికనగర్‌కు చెందిన నాగరాజు గంజాయి విక్రయిస్తుండగా దాడి చేసి 250 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తడికలబజారు సెంటర్‌కు చెందిన రోహిత్‌కుమార్ షాహు అనే వ్యక్తి వద్ద కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడించడంతో పోలీసులు అతడి కోసం గాలిస్తున్నారు.